క్లుప్తంగా

దుకాణాల తనిఖీ



గార్ల: చైనా మాంజా విక్రయించిన దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని గార్ల–బయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా హెచ్చరించారు. శుక్రవారం గార్లలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. సంక్రాంతి సెలవుల్లో ఊర్లకు వెళ్లే వారు ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచరాదని, బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకొని వెళ్లాలని సూచించారు. ఊర్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

టోర్నమెంట్ ప్రారంభం



మహబూబాబాద్ అర్బన్: క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని నామిరెడ్డి సీతారాం రెడ్డి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ నామిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్వతమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో బాబురావు, వెంకన్న, మహేందర్ రెడ్డి, పాపాచారి పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర సమావేశం

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్‌ఎస్‌ఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 12వ తేదీన పట్టణంలోని పీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి కొండపల్లి కేశవరావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు రంగావఝల సుధాకరశాస్త్రి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

దోర్నకల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దారు కృష్ణవేణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, నవాబ్, వెంకట్రాములు, బాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామ రెవెన్యూ పరిధిలో గల వ్యవసాయ భూమి హద్దురాళ్లను పక్కరైతు తొలగించి భూమిని ఆక్రమించుకున్నాడని, సర్వేయర్ ద్వారా సర్వే చేయించి భూమిని ఇప్పించాలని శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు బాధిత రైతులు బోనగిరి సుదర్శన్‌రావు, లక్ష్మారెడ్డి, మట్టారెడ్డి తెలిపారు.

ముగ్గుల పోటీలు

నెహ్రూసెంటర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సీపీఐ నేత అమరజీవి తోట విజయ్ స్మారకార్థం ముగ్గులను పోటీలను ఈనెల 12వ తేదీన ఉదయం 9గంటల నుంచి నిర్వహిస్తున్నామని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మీ, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ శుక్రవారం పిలుపునిచ్చారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ.5,016, ద్వితీయ బహుమతి రూ.3,016, తృతీయ బహుమతి రూ. 2,016, నాల్గో బహుమతి రూ.1,016, కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 98664 79666, 99593 43360, 96660 38001 నంబర్లో సంప్రదించాలన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

గార్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టిబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, జనార్దన్, భిక్షమయ్య, వీరన్న, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు చోరీ

కురవి: మండలంలోని కందికొండ గ్రామంలో తోట అంజయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ఉండే విద్యుత్ మోటార్‌ను, తీగలను రెండురోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధిత రైతు అంజయ్య శుక్రవారం తెలిపాడు. దీంతో రూ.30వేల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నాడు. చోరీకి చేసిన మోటార్‌ను పట్టుకోవాలని పోలీసులను కోరాడు.

కందకాలు పూడిస్తే చర్యలు

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారు మంగ్య తండా పరిధిలోని ఆకేరు వాగు ప్రాంతంలో శుక్రవారం పెద్ద మొత్తంలో తహసీల్దార్ జేసీబీతో కందకాలు తీయించారు. కందకాలు ఎవరైన పూడిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కోడిచింతల రాజు, ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

లక్ష్మీనారాయణస్వామి, సనాతన శివాలయం, శ్రీషిర్డీసాయిబాబా, వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పూజారులు ఆలయాల్లోని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు ప్రవేశం కల్పించి దర్శనం కల్పించారు
- సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రామాలయంలో భక్తుల సందడి



గార్ల: లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..



కురవిలో పూజలో పాల్గొన్న భక్తులు



బయ్యారం: భక్తులకు దర్శనమిచ్చిన సీతారాములు



దోర్నకల్: వేంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వార దర్శనం



గూడూరు: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం



కేసముద్రం: అమీనాపురం గ్రామంలో..



కురవి: సీతారామచంద్రస్వామి మూలవిరాట్టు



మహబూబాబాద్ రూరల్: పూజలు చేస్తున్న భక్తులు

మోకాళ్లతో మెట్లెక్కి ఎమ్మెల్యే శ్రీవారి దర్శనం



మహబూబాబాద్ రూరల్: మానుకోట ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆకాంక్షించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుపతి బాలాజీ సన్నిధిలో సకుటుంబ సమేతంగా ఎమ్మెల్యే శుక్రవారం మోకాళ్లతో మెట్లు ఎక్కి మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక డంప్‌ల సీజ్

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక డంపులను శుక్రవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేసి మహిళలకు ప్రతినెల రూ.2500 చెల్లించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపాల తిరుపతమ్మ, ఊకె పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పీఓడబ్ల్యూ విలీన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఫిబ్రవరి 20వ తేదీన జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘాల రాష్ట్రస్థాయి విలీన సభ ఈనెల 24వ తేదీన మంచిర్యాల జిల్లాలో జరుగుతుందని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా పగిడిపాల తిరుపతమ్మ, కార్యదర్శిగా ఊకె పద్మ ఎన్నికయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల: ప్రభుత్వ అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డల తల్లులకు ఒకవరం లాంటిదని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ నమూనా ఇంటిని ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆరు గ్యారంటీల పథకాలు అమలులో ఎలాంటి సందేహం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, బట్టు నాగరాజు, కట్టా శ్రీనివాసరావు, భూక్యా నాగేశ్వరరావు, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ మంగమ్మ పాల్గొన్నారు.



గార్ల: ఇందిరమ్మ నమూనా ఇంటికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అభినందనీయం

బయ్యారం: మండలంలోని గంధంపల్లిలో శుక్రవారం మహబూబాబాద్‌కు చెందిన మైత్రి మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరంను ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేట గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు

పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. విద్యార్థుల వేషధారణ అందరిని ఆకట్టుకుంది.
- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: పర్వతగిరి ఎంపీపీఎస్ పాఠశాలలో..



మహబూబాబాద్ అర్బన్: బేతోల్ ప్రభుత్వ పాఠశాలలో..



చిన్నగూడూరు: చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



దోర్నకల్: బ్రిలియంట్ పాఠశాలలో వేషధారణలో విద్యార్థులు



తొర్రూరు: సిద్ధార్థ పాఠశాలలో వేషధారణలో విద్యార్థులు

యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సదానందం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సీహెచ్.మదార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఉమ్మడి జిల్లాస్థాయి హన్మకొండలో యూత్ ఫెస్టివల్‌లో క్విజ్ పోటీల్లో విష్ణు, బాలు, సందీప్ బృందం ప్రథమ బహుమతి సాధించినందుకు విద్యార్థులను డీఐఈఓ మదార్, అధ్యాపకులు అభినందించారు. ప్రభుత్వ బాలికల కళాశాలలో యువజన ఉత్సవాల్లో రిషిక క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రథమ బహుమతి, జానపద నృత్యంలో స్వాతిక బృందం మొదటి స్థానం, పోస్టర్ పెయిటింగ్‌లో మోహరతి తృతీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం తెలిపారు.

తొర్రూరు: కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూత్‌ఫెస్ట్‌లో తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. తాజాగా హనుమకొండలో నిర్వహించిన ఫెస్ట్‌లో విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. ప్రిన్సిపాల్ అరుణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ అభినందించారు.

ఉత్తర్వులు విడుదల చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

కురవి: రాష్ట్ర క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదించిన కారుణ్య నియామక ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోద్గులగూడెంలో సంఘం మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 588 కారుణ్య నియామక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల గ్రాట్యుటీ, కమ్యూటేషన్ల చెల్లింపులు ఎప్పుడు చేస్తారన్నారు. పదవి విరమణ పెంపు నిర్ణయం అశాస్త్రీయమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల భోజన బిల్లులు చెల్లించాలని, కులగణనలో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యునరేషన్ చెల్లించాలన్నారు. పదవి విరమణ సొమ్ము చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్.శ్రీనివాస్, జి.వెంకన్న, తోటశ్రీరాములు, కేఎస్‌ఎస్ లత, ఇందిర, భాగ్యలక్ష్మి, విష్ణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



అరెస్టు చూపుతున్న పోలీసులు

కురవి: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం శివారులోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఖమ్మం జాతీయ రహదారిపై కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కురవికి చెందిన కట్ల ఉమేష్, మహబూబాబాద్ మండలం మాధాపురం శివారు తూర్పుతండాకు చెందిన అంగోత్ రాములు ఇద్దరు కలిసి చింతూరు నుంచి బైక్‌పై కురవికి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద రూ.45వేల విలువైన కేజీన్నర గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం కట్ల ఉమేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించగా శుక్రవారం అంగోత్ రాములును రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఏఎస్సై వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, కానిస్టేబుళ్లు బద్రు, నరేష్, హరిబాబు, గణపతి పాల్గొన్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

స్వప్రయోజనాలకు పార్టీని తాకట్టుపెట్టొద్దు

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ నాయకులుగా చెప్పుకుంటున్న కొందరు తమ స్వప్రయోజనాల కోసం పార్టీని తాకట్టు పెట్టే ప్రయత్నం చేయటం తగదని కాంగ్రెస్ మండల నాయకుడు సనప సోమేష్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎవరైన ఇష్టానుసారంగా వ్యవహరిస్తే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వయసు పెంపు ఆలోచనను విరమించుకోవాలి

గార్ల/పెద్దవంగర: ఉద్యోగుల పదవి విరమణ వయసు పెంపు ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గార్లలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు యాదగిరి, చిక్కాల సతీష్, హనుమంతు, వెంకట్‌రెడ్డి, అజ్మీర సామ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయ సేకరణ

నెల్లికుదురు: రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పోలీస్‌సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించనున్నట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసుల సేవలపై ప్రజల అభిప్రాయాలను ఎఫ్ఐఆర్, ఈ–చాలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ తదితర అంశాలపై క్యూర్ కోడ్ స్కా చేసి అందులోని లింక్ ద్వార అభిప్రాయాలను తెలపాలని ఎస్సై కోరారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

మహబూబాబాద్ రూరల్: ప్రతీ ఒక్కరు సంస్కృతీ సంప్రదాయాలు అంతరించిపోకుండా కాపాడుకోవాలని టౌన్, రూరల్ ఎస్సైలు వెంకటేశ్వర్లు, దీపికరెడ్డి అన్నారు. మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక 26వ వార్డు స్థానిక సిగ్నల్ కాలనీలో శుక్రవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా హాజరైన ఎస్సైలు వెంకటేశ్వర్లు, దీపిక రెడ్డి బహమతులు అందజేశారు.

క్రీడల్లో రాణించాలి

గూడూరు: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాధవపెద్ది రమేశ్‌చందర్‌రెడ్డి, ఎస్సై గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొల్లాపురంలో శుక్రవారం విజేత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన కబడ్డీ, వాలీబాల్, షటిల్ క్రీడలను వారు ప్రారంభించారు. జేశారు.

విద్యార్థుల ప్రతిభ

నెల్లికుదురు: ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయిలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో యువజన ఉత్సవాల్లో నెల్లికుదురు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శుక్రవారం ఎస్సై చిర్ర రమేశ్ బాబు, ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తగూడ: గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు మండలంలోని ఓటాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, మోడల్ ప్రశ్నాపత్రాలను అందజేశారు. ఆయన వెంట కొత్తగూడ, గంగారం ఎస్సైలు కుశకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మరిపెడ: ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవి అన్నారు. మరిపెడ పీహెచ్‌సీలో శుక్రవారం క్షయవ్యాధి నిర్ధారణ షాంపిల్స్‌ను సేకరించారు.

పీడిత ప్రజల పోరాట యోధుడు లెనిన్

నెహ్రూసెంటర్: ప్రపంచ పీడిత ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన విప్లవ యోధుడు లెనిన్ అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ వర్ధంతి ముగింపు సభపోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 21వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లెనిన్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బామ్మర్దిపై బావ కత్తితో దాడి

కొత్తగూడ: బామ్మర్దిపై బావ కత్తితో దాడి చేసిన సంఘటన మండలకేంద్రంలోని వారాంతపు సంతలో శుక్రవారం జరిగింది. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంతలో ప్లాస్టిక్ డబ్బాలు విక్రయించుకునే లింగమ్మ షాపు పక్కనే తన అల్లుడు సదానందం షాపు ఉంది. షాపు సర్దే క్రమంలో లింగమ్మ షాపు స్థలంలోకి సదానందం జరిపి షాపు పెట్టుకున్నాడు. నీ స్థలంలో షాపు పెట్టుకో అమ్మకు ఇబ్బంది అవుతుందని రాము బావ సదానందంతో అన్నాడు. దీంతో ఇద్దరికి గొడవ జరిగింది. సదానందం రాముపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన రామును ఆస్పత్రికి తరలించారు. లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

చలి తీవ్రతతో వృద్ధుడి మృతి

గూడూరు: మండలంలోని గాజులగట్టు శివారు పాటిమీదిగూడెంలో శుక్రవారం ఓ వృద్ధుడు చలి తీవ్రతను తట్టుకోలేక మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాల ప్రకారం సనుప వెంకటయ్య (63) భార్య ఎల్లమ్మ ఉన్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉండగా, కొన్ని సంవత్సరాల క్రితం మృతిచెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన వృద్ధ దంపతులు పింఛన్ డబ్బులతో గడుపుతున్నారు. ఇటీవల చలి తీవ్రత పెరగడంతో అనారోగ్యానికి గురైన వెంకటయ్య తెల్లవారే సరికి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కేసముద్రం: కేసముద్రం మండలానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్ చిత్రపటాలకు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, దస్రూనాయక్, వెంకన్న, సురేందర్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామ శివారు గుజిలి తండాలో ఉన్న మూతబడిన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సీరోలు ఎంఈఓ ఇస్లావత్ లచ్చిరాంనాయక్ సందర్శించారు. తండాలోని ప్రతి ఇంటికి వెళ్లి పిల్లలను బడికి పంపిస్తే బడిని తెరిపిస్తామని తల్లిదండ్రులకు ఎంఈఓ వివరించారు.